

# దేవుడ్ని బొజ్జలో పాలుపోసిన అమ్మ!

అరవై డెభ్భై మందితో కిటకిటలాడి పోతూన్న బస్సు ఎన్ని కథలైనా చెప్తుంది.

నిజానికి బస్సు కండక్టరు ఎక్కడోకాని మంచివాడుండడు. ఉన్నా అతన్ని బస్సులోని వాళ్ళు బతకనివ్వరు. చిల్లర కోసం ఎప్పుడూ పేచీ వస్తూనే వుంటుంది. ఇరవై పైసలివ్వవలసిన వానికి, ఇవ్వడం మాట అటుంచి, 'ఐదు పైసలివ్వండి' అంటాడు.


అప్పుడు మొదలవుతుంది పేచీ...!

అవతలివాడు తిక్క శంకరయ్య అయితే... ముందుగానే ఆ కండక్టరు ఆ టిక్కెట్టిలా యివ్వండి బాకీ రాస్తాను అంటాడు.

'దిగేప్పుడు అడగటం మరచి పోతానయ్యా ఇప్పుడే ఇవ్వు...' అంటూ నిలేస్తాడు ఆ వ్యక్తి.

'ఉంటే యివ్వనూ...' అంటూ, ఆ సంచి మొగంమిాదెట్టి, 'చూసుకో...' అంటాడు కండక్టరు.

ఈ మధ్య జగదాంబ బస్సు స్టాపొస్తుంది. ఓవర్ ఫ్లోగా ఉన్న జనం, జాలీగా బస్సు ఊచల్నీ కిటికీ ఊచల్నీ దొరకపుచ్చుకొని వ్రేలాడూ తూన్న ఆ ముఠా ఎప్పుడైనా రాలిపోడానికి సిద్ధంగా



రంధి సోమరాజు

ఉన్న బందిపోట్లు చల్లగా జారిపోయి ఉడాయిస్తారు. గబగబా కండక్టరు ఆ దిశగా ఒక్క ఉరుకు ఉరికి 'ఏమయ్యోయ్... నీ టిక్కెట్టు...చూపించూ...' అని అరుస్తాడు. అటు వెళ్ళిపోతూన్న నలుగురైదుగురివైపు చూపు కాన్సెంట్రేట్ చెయ్యలేక ఆ ఒక్కణ్ణే అడుగుతాడు.

డబ్బులెగవేసిన ఉషారులో ఆ ఒక్కడూ గాలిలో తేలిపోతూ ఆకాశంలోకి ఓ పిచ్చి టిక్కెట్టు ముక్క విసురుతాడు. అది నిన్నటిదో...మొన్నటిదో...లేక మరో బస్సుదో ...చిత్తుకాగితం ముక్కో ఆ భగవంతునికే తెలియాలి. కండక్టరు ఆ మనిషి టిక్కెట్టు చూపించినట్లే భ్రమించి ఆడవాళ్ళ గేటువైపు వెళ్తాడు.

'ఏవమ్మో...మీ టిక్కెట్టు...' స్టైలుగా వెళ్ళిపోతూన్న ఆ అమ్మణ్ణి గుంజుతున్నట్లడుగుతాడు. ఆ పాప నడిరోడ్డుమీద రేప్ చేయబడుతూన్నట్లు మొగమెట్టి, 'డబ్బులిందాకే పుచ్చుకున్నావ్...నువ్వే టిక్కెట్టు బాకీ...' అంటుంది.

'ఆ...మీరా...వెళ్ళండి...వెళ్ళండి' అంటాడు సర్దుడు కుత్తుకతో. ఇంతకీ ఆ సత్యభామ టిక్కెట్టు కొన్నదో లేదో...మరి ఆ సత్యాసత్య మీమాంస దేవుడికే తెలియాలి.

తిరిగి కండక్టరు బస్సులోకి దూకేసరికి అందులో కూర్చున్న వాళ్ళూ, నిలబడిన వాళ్ళూ విసుగెత్తిపోయి 'రైటు చెప్పవయ్యా ప్రాణం పోతోంది. వీడెవడో కొత్త గాడిదలావున్నాడు. వెళ్ళిపోయేవాణ్ణి టిక్కెట్టు అడగబోతాడేమిటి? ఒరే నాయ్నా పేనాలు గిలగిల్లాడిపోతూన్నాయి. రైటు చెప్పరా బుజ్జి గుంటడూ... అంటూ ఇద్దరు ముగ్గురు అరుస్తారు. ఉత్త కాకిగోల. పైపెచ్చు వుత్త రొంప నవ్వులు... అప్పుడే తమముందు సినీ హీరోయిన్ జాకెట్టు విప్పేసినట్టు ఓ కేరింతలు.

అప్పుడే మరోడు 'రైట్' అని కిటికీలోంచి, చెయ్యి కిందికి జార్చి బస్సు బాడీ మీద బాడీ లేని వీపు మీద దరువులేస్తూన్నట్టు దుబ్బు దుబ్బున బాదుతాడు.

'నీ కంఠం మా కండక్టరు శవాన్ని కాదులే...' అన్నట్టు ధీమాగా సీట్లో కూర్చొని స్టీరింగ్ మీద చెయ్యేసి ఉఫ్‌న సిగరెట్టు పీల్చి పొగ వదుల్తున్నట్టు మహా కుషీగా పోజ్ పెట్తాడు డ్రైవరు.

'ఇహ స్టార్ట్ చెయ్యరా...డ్రైవర్ దేవుడూ... ప్రాణం ఎండి వొరుగైపోయింది. గాలి ఆట్టం లేదు.' అంటూ చొక్కా కాలర్ బొత్తాంలు తప్పించి, వెనక్కిలాక్కొని గుండెల మీద ఊదుకుంటూ ఉస్సురని పోయాడు; బస్సులో ముగ్గిపోయి నల్లబడి పోతూన్న చక్కెరకేళీ అరటి పండుగాడు.

ఇంతలో బస్సు పూర్ణా మార్కెట్టు దగ్గర కొచ్చింది. గబగబా కొంతమంది దిగిపోగా దబదబా కూరగాయల బస్తాలూ, గంపలూ జట్టువాళ్ళు కుక్కేస్తారు. మనిషి నుంచోడానికి కూడ మరి చోటు లేదు. ఒంటిపాదంమీద కొన్ని కొంగలు నిలిచాయి. కొంతమంది బస్తాల మీద చతికిల పడ్డారు.

'బత్తాలమీద కూకోకండి బాబులూ... పొట్లకాయలు విరిగిపోతాయి బాబ్బాబూ...' అంటూ నల్లటి బండలాంటి మనిషి, ముక్కు

## కోకాకోలా

'కోకాకోలా' అనే పానీయాన్ని 1886లో కనిపెట్టారు. అది ఎలా తయారు చేస్తారు అనేది యిప్పటికీ మహా రహస్యమే. అది ఇద్దరికే తెలుసు. వీరు ఒకే చోటుకు వెళ్ళాల్సి వచ్చినా ఇద్దరూ రెండు వేరు వేరు విమానాలలో ప్రయాణం చేస్తారు. ఒకరు ప్రమాదంలో మరణించినా రెండవవారి వద్దనైనా యీ మహా రహస్యం అతి జాగ్రత్తగా వుండి వుపయోగ పడుతుందని.

(కె.వి.రావు సౌజన్యంతో)

ల్నిండా చెవుల్నిండా తులాలకొద్దీ బంగారం దిగేసుకున్నది కయ్‌మనకుండా కయ్‌మంది. ఈ ఫ్లేష్‌గన్ మొగాలమీద సైలెంట్‌గా అలముకోక ముందే చల్లగా అందరూ నిలుచుండి పోయారు. ఎందుకూ...అదేమిటీ...అనకండి. ఇదొక సర్దుడు వ్యవస్థ! ఉత్త పిరికి ముండా సన్నాసి!!

ఎవడో మరీ చాతకానివాడు, 'ఏమిటయ్యా కండక్టరూ...ఇది సామాను బస్తా...పాసింజరు బస్తా' అంటూ గద్దించాడు మరీ నోరు కుట్టేసుకోలేక.

'పాపం వాళ్ళూ మనుషులేనండి. దింపేస్తే చచ్చిపోతారు వాళ్ళ బతుకంతా ఆ మూటలే... ఏదో సర్దుకు పోవాలి. మనకు తినడానికి కూరలు కావాలి కదా... ఆ కూర తల్లులు లేకపోతే ఎలా...' అంటూ ఆ క్షణంలో చీఫ్ మినిష్టరై పోయాడు; ఆ మినీ బస్ ప్రపంచపు చక్రవర్తి! అలా కాస్త కాస్త తగ్గి మాట్లాడకపోతే యిక్కడ ప్రజాసామ్యం ఎలా నిలుస్తుంది? చక్రవర్తి డాబులు డాబితే గోవిందో...గోవింద...!

'ఇంక రైటు చెప్పవోయ్ నాయ్డో...చేపల కంపు అదరగొట్టైస్తోంది. నిలవలేకపోతూన్నాం' అన్నాడు మరో నలిగిపోయిన తెల్ల బట్టల మనిషి!

ఒక్క ఊపుగా బస్సు స్టార్ట్ అయి కొత్త రోడ్డు పైనుంచి పోర్టు ట్రస్ట్ గొడౌన్స్ మీదుగా కాన్వెంట్ చేరేసరికి లోపల కూర్చున్న వాళ్ళు, నిలచి ఏడుస్తూన్న వాళ్ళూ సుఖంగా గాలి పీసుకుని క్రిక్కిరిసి ఉన్నవారు కాస్త వొదులొదులుగా నిలచినట్లు తేలిక పడ్డారు.

కండక్టరు టిక్కెట్లు కోస్తూనే వున్నాడు. మనుషుల మధ్యజరజర దూరుతూనే ఉన్నాడు. చిల్లరకోసం తాపత్రయ పడుతూనే ఉన్నాడు. చల్లగా గాలి బలే ఉషారెక్కి వీస్తోంది.

ఈ క్షణిక స్వర్గం వీళ్ళ కెందుకూ అన్నట్టు పెద్ద జడివానలా జైమని వందలకొద్దీ జనం బస్సు చుట్టూ ఈగల్లా కాన్వెంటు దగ్గర మూగి పోయారు. అవతల బస్సులోపల పంచదార రాసులు కుప్పలడివున్నట్టు, ఎక్కేవాళ్ళదిగేవాళ్ళ పోరాటాలు ఆరాటాలు చూస్తొంటే చీఫ్ మినిష్టరు పోటీ ఏదో జరుగుతూన్నట్టే వుంది. అందరికీ ఫుల్ బాటిల్ కొట్టేసినంత ఉషారు!

టిక్కెట్లు పుచ్చుకున్నవాడే దిగుతున్నాడో లేదో..., ఎక్కిన వాళ్ళల్లో ఒక్కడైనా టిక్కెట్టు పుచ్చుకోడానికి ముందుకు వస్తున్నాడో లేదో ఎవరికీ అర్థం కాదు. అంతా అయోమయ స్థితి! గందరగోళం! బస్సులో ఈలలు, అరుపులు తిట్లు... 'కదులు కదులు బస్తా...కదలవే రాజ హంసా...' పాటలు, 'కదలవే తల్లీ...కదలవే నల్లీ...' అంటూ.

'ఈ డ్రైవరుకు పెళ్ళాం బిడ్డలు లేరు కాబోలు అర్ధరాత్రి యింటికి చేరినా రాంభజన గొడవ లేదేమో! మా తాపీగా విఘ్నేశ్వరుడిలా కూర్చున్నాడు. ఇప్పుడు పుట్టిన పిల్ల సమర్తాడే దాక బయలుదేరడేమో...' అంటూ రక రకాలుగా బూతు ఎకసెక్కాలతో ఓ పెద్ద బ్లూ ఫిల్మ్ బూతు బొమ్మల్లా కిచకిచలాడి పోయారు.

ఆ మాటలు వినివిని కుళ్ళిపోతూ బస్సు డ్రైవరు 'ఒరి కండక్టరు ముండాకొడకా... ఏరా కునుకు మొగం నాయాల... ఇక్కడ ఉన్న ఆడవాళ్లకు టిక్కెట్లు కోశావా... నువ్వు చిత్తగించే సరికి యివ్వాళ పురుడోసుకున్నది మళ్ళీ పురుడోసుకోడానికి సిద్ధమైపోద్ది...' అంటాడు ఇలా వాళ్ళల్లో వాళ్ళు ఈ నాటి మంత్రులు ఆ నాటి మాజీ మంత్రులూ చమత్కారాల, కారాల రాళ్ళు విసురు కోవడంతో ఉషారుకు రొమాంటిక్ కలలొచ్చి నట్లయింది.

ఇంతలో బస్సు కదిలింది.

జనం 'హమ్మయ్య' అనుకున్నారు.

ఇలా ఉండగా ఆడవాళ్ళ సీట్లలో మగవాళ్ళ సీటుకు ముందుకూర్చున్న ఓ అమ్మి 'ఏటి బాబూ...నాకో టికెటీ కొయ్యవేటి...' అంది.

ఆ మాట చాలామందికి వినిపించింది. కాని కండక్టరు ఆ దరికి చేరలేదు. ఆ ఆడవాళ్ళ గేటు దగ్గర్నుంచి ముందుకు రాలేకపోతున్నాడు, ఇంతట్లో 'ఏవమ్మా... టిక్కెట్టు తియ్యవేమిటి?' అన్నాడు దారిలో నిలిచిన ఓ అమ్మాయిని కండక్టరు.

'మావోడు తీసేదా...' అంది.

'అనక మీ ఆయన్ను ఎదికి పట్టుకుందువు గానిలే... ముందు యిద్దరికీ డబ్బులియ్యి...' అన్నాడు.

'రెండా... మా రాములు మావ ఆడ నేడా...' అంటూ చెయ్యి చూపిస్తుంది మగాళ్ళ వైపు.

అప్పడే ఆ రాములు మావ 'నాను తీసేసి నానే... నువు తీకు' తీతువులా ఓడికీ మొగ మాపడకుండ కైమన్నాడు.

'మరి యీ దొంగ సచ్చినోడు మళ్ళీ తెమ్మంటాడేటీ? దొబ్బిడాకి అందరూ పెద్దోలే...' గట్టిగానే అరిచింది.

ఆ మాటలు కండక్టరుకు వినిపించాయి. కాని ఆ రాములు మావ కనిపించ లేదు. అకస్మాత్తుగా మంత్రి పదవి ఊడి పోయినట్లు కుమిలిపోయాడు. నిజంగా ఆ రాములు మావ పుచ్చుకొన్నాడో లేదో తెలియదు. కాని ఆడి మాటల్ని ఈ రావులమ్మ మరి టిక్కెట్టు పుచ్చుకోదు. రెండు టిక్కెట్లు గల్లంతురా దేవుడా... అని మనసులో కుక్కేసుకొని ముందున్న ఆడాళ్ళకు టిక్కెట్లు ఇస్తున్నాడు.

'ఈ టికటీలు యిచ్చే బాబుకి సొమ్మంటే మా 'సేదునాగుంది' అంటూ ఇందాకటినుంచి టిక్కెట్టుకోసం సతమైపోతూన్న అమ్మి అదే-మగాళ్ళముందున్న ఆడాళ్ళ సీట్లో కూర్చున్న మనిషి... కొంచెం గట్టిగానే అంది. ఆ వెనుక సీట్లో ఉన్న వ్యక్తి ఆమె ఆందోళన గమనించి 'ఎందుకమ్మా అంత తొందర...' అన్నాడు.

అప్పుడా అమ్మి అతని వైపు తిరిగింది.

అంతే... ఆ బస్సు మరో బస్సును దభేలున గుద్దుకొని తిరగబడిపోయినట్లు... జనం అల్ల కల్లోలంగా నెత్తుటి కాల్వల మధ్య అరుస్తూ మూలుగుతున్నట్లు అతను ఫీల్ అయ్యాడు.

ఎప్పుడూ తుడవని ఆ బస్సులోని మట్టి అంతా ఆమె చీరనంటుక పోయినట్లుంది. డ్రైవరు ముందువ్న అద్దం మీద పరచుకున్న దుమ్మూ, దూళీ ఆమె మొగాన అలము కున్నట్లుంది. పీకేసిన సీటు కుషను ఊడి రాలిపోగా మిగిలిన బల్లచెక్క మీద వున్న తుప్పు పట్టిన రెండు స్క్రూ మేకుల్లా ఆమె చూపు! చూడగానే వికృత మనస్కుడైపోయాడు. ఎంత జుగుప్సాకరంగా వుంది! అనీ అనుకున్నాడు.

మెల్లగా 'ఎక్కడికెళ్ళాలేమిటి' అన్నాడు.

'నాను సిరిపురం కాడ ఎక్కినాను. పాత గాజువాకెల్లాలి. అప్పుడే సానా దూరమెల్లి పొచ్చిసినాం టికెట్ నేకపోతె జుల్మానా అంటాడు. నాను ఏడ సచ్చీది' అంది.

అప్పుడా జంటిల్‌మన్ మెల్లగా చెవిలో ఊదుతూన్నట్లు 'సింధియాకాడ పుచ్చు కుందువు గాన్లే...అక్కడ నుంచైతే నీకు డబ్బులు మిగుల్తాయి' అన్నాడు.

ఆమె మొగంలో వెలుతురు లేదు. కళకళ పాటు లేదు. డబ్బు గురించిన గుంజాటనా లేదు. 'పెద్దోళ్లు తమరు...మోలాటోలికి సెల్లుద్ది.నాకు సేతులురావు.గుండె సచ్చిపోద్ది...' అంది.

అతను మెల్లగా... 'అది కాదే తల్లీ... రూపాయి మిగులుద్ది. దేనికైనా పనికొస్తాది. ఉన్నవాళ్ళకు ఫరవాలేదు. నీకేటి ఈ తెగులు' అన్నాడు.

ఆ అమ్మి అటువైపు తిరిగి ఉన్నది.దుష్టులకు దూరంగా ఉండు అన్నట్టు చప్పున తిరిగి పోయింది. అతని మొగం చూడ బుద్ధి కానట్టు మరి మాటాడ లేదు.

ఈ లోగా కండక్టరు అక్కడకు వచ్చాడు. టికెట్... టికెట్... అంటున్నాడు. బ్రిడ్జీ దిగి డాక్ లేబరు యార్డు విజయనగరం గేటు దగ్గర కొచ్చి ఆగకుండానే సింధియా దిశగా మహా జోరుగా పరుగుతీసింది, చిన్నారి సిటీ బస్సు.

కూరగాయల బస్తాలు, ఆ బస్తాలాంటి మనిషి సింధియా దగ్గర దిగిపోయి బస్సుకు కొంచెం ప్రాణం పోసింది. పాపం పొట్లకాయలు కొన్ని విరిగి పోయాయి. 'అలమ్మ కడుపు కాలా...దొంగసచ్చినోలుసెప్తే యినిపిచ్చుకోరు' ఏడుస్తూనే వుంది. జోరుగా బస్సు ముందుకు జారిపోయింది.

ఈ లోగా టిక్కెట్టు తియ్యని అమ్మి దగ్గరకు కండక్టరు వచ్చాడు.

బొడ్డు కాడ ముడేసుకున్న డబ్బు, ఊడపీకు తూన్న ఆ అమ్మి వైపు ప్రక్కనున్న ఆ ఆసామీ చూసి కండక్టరుతో 'ఈ అమ్మి సింధియాలో ఎక్కింది. పాత గాజువాకకు టిక్కెట్టు ఇవ్వు...' అంటూ డబ్బు లివ్వబోయాడు.

అప్పుడా అమ్మి భూగర్భపు అట్టడుగున దాగి వున్న నిజాయితీ జలలా భూమిపైకి నీటిబుగ్గగా పొడుచుకొచ్చింది. 'అరి సొమ్ము నాకొద్దు బాబూ... నాను సిరిపురంలో యెక్కినాను పాత గాజువాకెల్లాల' అంటూ చేతిలో గుప్పెడు చిల్లరెట్టింది.

ఈ నిజాయితీని, నిరుపేద అయినాకూడ పరుల డబ్బుకాశపడని, స్వీకరించలేని ఆమెలోని స్వాభిమానాన్ని చూసి బస్సులో ఉన్న జనం అంతా తమతమ గుండెల్ని తడుపుకున్నారు. మొకమొగాలు చూసుకున్నారు. ఎంత గొప్ప మనిషి...వ హవ్వా... అనుకున్నారు.

ఎన్నో రకాలుగా డబ్బు లేగవేస్తున్నా వ్యక్తులను నిత్యం చూస్తూవున్న కండక్టరు మొగం ఒక్కసారి దిగ్భ్రాంతి పడిపోయింది.

'ఆ బాబు సాయం చేస్తానంటే పుచ్చు కోవేం...' తనుకూడ సాయపడాలని కాబోలు, కండక్టరు అలా అనకుండా ఉండలేకపోయాడు.

'ఉత్తి పున్నేన వోడి మోసేతి నీలూ తాగిలేను. కట్టపడీవోలని ఆ దేముడెయ్యాలా సల్లగా సూత్తాడు. యియ్యాల డబ్బులెగవేత్తే మల్లీ బస్సెక్కడాకి మొగం సెల్లుద్దేటి? మడ్సి జెల్మెత్తినోలు వోరూ సెయ్యగూడదు బాబూ యీ బాడుకా పన్లు...' అంటూ బస్సు దిగిపోయింది.

ఆ అమ్మిని దేవుడెప్పుడూ చల్లగచూడలేదు. అయినా ఆ దేవుడి బొజ్జలో యిన్ని పాలు పోసింది!

# సుభాషితాలు

తనను ప్రేమించినంతసేపూ ప్రియురాలికి ప్రాణం ఇవ్వడానికి సందేహించడు. ఆమె ప్రేమించడం మానిందా ప్రాణం తియ్యడానికి వెనుదీయుడు.

—చలం

* * *

నిజమైన ప్రేమకు ఈ సమాజంలో సమాధే మిగిలుతుంది.

—షేక్స్‌పియర్

* * *

మగవారిలో మహాబలవంతులు, ఆడవారిలో అతి సుకుమారులు పెళ్లి చేసుకోవటానికి భయపడతారు.

—ఆల్‌ఫ్రెడ్

* * *

తనకంటే తక్కువ వాడిని అనుకున్న మగవాడిని ఏ స్త్రీ ప్రేమించదు. ఆరాధన, ఉత్సాహము లేకుండా ప్రేమిస్తే అది స్నేహమే గాని ప్రేమకాదు.

—డుటేవాంట్

మనం ఇతరులకోసం ఏం చేస్తామో అది మన శక్తికి నిదర్శనం. మనం ఇతరులకోసం ఏ బాధల ననుభవిస్తామో అది మన ప్రేమకు నిదర్శనం.

—బి.బి.ఎస్. డబ్ల్యు.కాట్.

సేకరణ:- పి.మల్లిక్, విజయవాడ.

ఎవరు కాల్చినా, ప్రతి తుపాకిగుండు ఎవరో ఒక స్త్రీ హృదయాన్ని గాయం చేస్తుంది.

—ఇందిరాగాంధీ

* * *

దరిద్రుల బాధలు చూసి ఎవరి హృదయం ద్రవిస్తుందో, ఎవరు వారి నికృష్ట జీవితం చూసి గుండెల్లో కుమిలిపోతాడో వారినే నేను మహాత్ముడంటాను.

—స్వామి వివేకానంద

* * *

కృతజ్ఞత నిజస్వరూపం, కనుకొలుకుల్లో నిలచిన అశ్రువులు, మాటల్లో అది లాంఛనరూపం దాలుస్తుంది.

—ప్రేమ్‌చంద్

* * *

అవకాశం తనంతతానుగా వచ్చి మన తలుపు తట్టదు. మనం అవకాశాన్ని వెంటాడుతూ దాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

—జాన్‌వాట్సన్ వర్

* * *

వెయ్యితుపాకుల కంటే వ్యతిరేకించే నాలుగు వార్తా పత్రికలకు భయపడాలి.

—నెపోలియన్

—సేకరణ:- శర్మ...సి హెచ్. విజయవాడ